హామీలను తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న బాలమల్లేష్

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. బోడుప్పల్ బొమ్మక్ శంకరయ్య గార్డెన్‌లో శుక్రవారం ఎం.మహేశ్వరి అధ్యక్షతన జరిగిన మేడిపల్లి మండల సీపీఐ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడిపల్లి మండలంలోని సర్వే నంబర్–48 భగత్‌సింగ్‌నగర్‌లో పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, మహిళలకు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. మేడిపల్లి మండల పరిధిలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి.జి. సాయిల్, మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, జె.లక్ష్మి, కె.ప్రమీల, సీహెచ్ మాధవి, దండు రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి అందించాలి

ఉప్పల్: ఉప్పల్‌లో విద్యుత్ సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం హబ్సిగూడ డీఈ సూర్యనారాయణతో ఉప్పల్ పద్మావతి కాలనీ తదితర కాలనీల అసోసియేషన్లతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, గృహజ్యోతి పథకం అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డీఈ ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాశి



విద్యుత్ సమస్యలపై మాట్లాడుతున్న మందుముల పరమేశ్వర్‌రెడ్డి

కంటి నాగరాజ్, పద్మావతి కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విజయకుమార్, సల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై పెప్పర్ స్ప్రే చల్లి దోపిడీకి విఫలయత్నం

ఉప్పల్: ఇళ్లల్లోకి చొరబడి వృద్ధులపై పెప్పర్ స్ప్రే చేసి దోపిడీకి యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు.. చిలుకానగర్ శివాలయం వద్ద నివాసముంటున్న పిట్టల సుదర్శన్ (66) ఉంటున్న ఇంటి మొదటి అంతస్తులో పోర్షన్ కు టు లెట్ బోర్డు ఉంది. మధ్యప్రదేశ్‌కు చెందిన హిమాన్షి(23), ఆమె సోదరుడు గాంధీ రామ్ కస్తూరీ (21) బోర్డును గమనించారు. వీరు చిలుకానగర్ లోనే ఉంటున్నారు. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సుదర్శన్ ఇంటికి వెళ్లి ఇంటిని అద్దెకు అడిగారు. అద్దెకు ఇస్తారా అంటూ పలకరించారు. తెలిసిన వారికి మాత్రమే ఇస్తామని చెప్పిన సుదర్శన్‌పై



నిందితురాలు హిమాన్షి



నిందితుడు గాంధీ

పోర్షన్ ఇంటికి తాళం వేయడానికి వెళ్లాడు. అతని వెనకే వెళ్లిన నిందితులు సుదర్శన్‌పై పిడి గుద్దులతో దాడికి తెగ బడ్డారు. నోట్లో గుడ్డలు కుక్కి పేపర్ స్ప్రే చల్లారు. పసిగట్టిన స్థానికులు నిందితులకు దేహశుద్ధి చేసి గదిలో బందించి పోలీసులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మన్మథ రావు తెలిపారు.

మైనర్ బాలికను వేధించిన యువకుడి అరెస్టు

మేడిపల్లి: మైనర్ బాలికకు ఫేక్ ఇన్‌స్టాగామ్ ఐడీతో పరిచయమైన వ్యక్తి ఆమె ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి తనను ప్రేమించాలని, లేదంటే సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరిస్తున్న యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.



అజయ్‌కుమార్

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా కొడకండ్ల గ్రామానికి చెందిన పి.అజయ్ కుమార్(ఫొటో డిజైనర్) ఓ మైనర్ బాలిక ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి ఫేక్ ఇన్‌స్టాగామ్ ఐడీ, ఫేక్ వాట్సాప్ ఐడీ ద్వారా ఆమెను బెదిరించాడు. దీంతో బాలిక మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న మేడిపల్లి పోలీసులు శుక్రవారం అజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం



అల్వాల్: మచ్చబొల్లారం గోపాల్‌నగర్ వీకర్ సెక్షన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శ్రీసత్యసాయి సేవా సమితి విద్యా జ్యోతి సేవలో భాగంగా శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. శ్రీసత్యసాయి సేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సరస్వతిదేవికి పూజలు నిర్వహించి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి మహిళా విభాగం అల్వాల్ ఇన్‌చార్జి వసంతలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రామలింగారెడ్డి, రమ, సత్యవాణి, భారతి, ఈశ్వరిదేవీ, రాణి, రాజారామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో బీజేపీ నాయకుల పర్యటన



రోడ్లను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు




జెడ్సీకి వినతి పత్రం ఇస్తున్న నేతలు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో బీజేపీ నాయకులు శుక్రవారం పర్యటించారు. శాంతినగర్, ఆర్యనగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్ , వినోభానగర్, మాణికేశ్వర్‌నగర్, పార్థీవాడ తదితర ప్రాంతాల్లో ఇటీవల వర్షాలకు పాడైన రోడ్లను పరిశీలించారు. అలాగే స్థానికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, (కంటెస్టెడ్ ఎమ్మెల్యే) మేకల సారంగపాణి జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌ను కలిసి తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, వేణు యాదవ్, పోచయ్య యాదవ్, ఉపేందర్, ప్రకాశ్‌గౌడ్, భిక్షపతి, రామకృష్ణ, శ్రీనివాస్‌చారి, కృష్ణమూర్తి, గోవర్ధన్, సతీశ్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

గాంధీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో 150 యూనిట్ల సేకరణ

గాంధీఆస్పత్రి: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలోని బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి 150 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా గాంధీ ఆస్పత్రి బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యరత్న మాట్లాడుతూ నగరంలోని పలు విద్యాసంస్థలు, నర్సింగ్ కాలేజీలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. వరల్డ్ బ్లడ్ డోనర్స్‌డే సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, గాంధీ మెడికల్



కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి, వైద్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రక్తదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గాంధీ బ్లడ్ సెంటర్‌కు రక్తందానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్నామని తెలిపారు.

'మీ సేవ'.. మా ఇష్టం..



ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు

- బినామీ పేర్లతో పలుచోట్ల దందా
- అన్ని ధ్రువపత్రాలకు మీ సేవ కేంద్రమే దిక్కు
- అధికారులు స్పందించాలంటున్న ప్రజలు

సాక్షి, మేడ్చల్: ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాల్లో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంతో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని పలు మీ సేవ కేంద్రాల్లో ధ్రువపత్రాల కోసం డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కంటే అధిక వసూళ్లు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మీ సేవ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు నిర్వాహకులతో కుమ్ముక్కవుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ధ్రువపత్రాల కోసం మీరు ఏ కార్యాలయానికి తిరగాల్సిన అవసరం లేదని, తమకు అడిగినంత ఇస్తే.. వాటిని తెచ్చిస్తామని మీ సేవ కేంద్రం నిర్వాహకులు ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

పలుచోట్ల దందా..

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేస్తే రూ.90 తీసుకోవాలి. కానీ కేంద్రాల నిర్వాహకులు రూ.120 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నారు. కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రాలకు దరఖాస్తు కోసం రూ.45 తీసుకోవాల్సి ఉండగా, రూ.70 నుంచి రూ.100 వరకు తీసుకుంటున్నారు. శివారుల్లోని పలుచోట్ల రూ.60 వరకు వసూలు చేస్తున్నారు. చాలా వరకు మీ సేవ కేంద్రాల్లో ఇదే దందా కొనసాగుతోంది.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా..

ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించడంతో పాటు యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నగరంతో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 1,327 మీ సేవ కేంద్రాలు ఉండగా, ఇందులో ఒక్క మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే 306 మీ సేవ కేంద్రాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా మీ సేవ కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తోంది. ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని చాలాచోట్ల అధిక రుసుం వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై 'తహసీల్దారు కనీస పర్యవేక్షణ చేయడం లేదు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఉన్నత చదువుల కోసం విద్యార్థులు కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదనుగా భావించిన నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏ సేవలకు ఎంత రుసుం చెల్లించాలో తెలియజేసే బోర్డులు పెట్టాల్సి ఉన్నా, కొందరు నిర్వాహకులు ఏర్పాటు చేయడం లేదు. మరికొన్ని మీ సేవ కేంద్రాల్లో సిటిజన్ చార్ట్ ఉన్నా.. వాటిని నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మీ సేవ కేంద్రాలకు ధ్రువ పత్రాల కోసం వచ్చే వారి సంఖ్య అధికంగా ఉండటంతో ప్రభుత్వం నిర్ణయించిన రుసుం మాత్రమే చెల్లిస్తామని నిర్వాహకులతో లబ్ధిదారులు చెప్పలేకపోతున్నట్లు వాపోతున్నారు.

బినామీ పేర్లతో నిర్వహణ..

నగరంతో సహా శివారుల్లో పలుచోట్ల మీ సేవ కేంద్రాలను ఒకరి పేరుతో అనుమతి పొంది. మరొకరు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు ఎవరి పేరుతో మంజూరు ఉంటుందో వారే కేంద్రాలను కొనసాగించాలి. కానీ పైరవీలు చేసుకొని కేంద్రం మంజూరు చేయించుకున్న వారు ఇతర పనులు చూసుకుంటూ వీటిని ఇతరులకు ఇస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి నిర్వహణపై పర్యావేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

రూ.40 అదనంగా తీసుకున్నారు..

నేను ఇటీవల డిగ్రీ పూర్తి చేశాను. పైచదువుల కోసమని ఆదాయ ధ్రువపత్రం కోసం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాను. నా దగ్గర రూ.90 వసూలు చేశారు. రూ.50 అని అడిగితే మేము చేయం వెళ్లమన్నారు. గత్యంతరం లేక ఎక్కువ డబ్బులిచ్చి దరఖాస్తు చేసుకున్నాను.

– వై.ప్రేమ్‌సాగర్, రామంతాపూర్, ఉప్పల్ మండలం

టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి..

ప్రతి మీ సేవ కేంద్రంలో సిటిజన్ చార్ట్ తప్పనిసరిగా ఉండాలి. అందులో సూచించిన మేరకే నగదు తీసుకోవాలి. అధిక వసూళ్లకు పాల్పడితే 1100 టోల్ ఫ్రీ నంబర్, లేదా స్థానిక తహసీల్దార్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. చర్యలు తీసుకుంటాం. ఎవరి పేరుపై ఉంటే వారే నిర్వహించుకోవాలి.

– భానుప్రకాష్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఖాతాదారులు హాజరు కావాలి

గౌతంనగర్: వెస్ట్ మల్కాజిగిరి బ్రాంచ్ హనుమాన్‌పేట్‌కు చెందిన ది కో–ఆపరేటివ్ సొసైటీ ఖాతాదారుల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు హనుమాన్‌పేట్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సొసైటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మల్కాజిగిరి: మౌలాలి డివిజన్ సాయినాథపురం ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స కోసం మంజూరైన రూ.60 వేల చెక్కును అతడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు.

శుభాకాంక్షలు



హబ్సిగూడ: కేంద్ర మంత్రులుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను శుక్రవారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

బీ కేటగిరి సీట్లను కౌన్సెలింగ్‌తో భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల్లో బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని తెలంగాణ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదీశ్వర్, తెలంగాణ రిపబ్లిక్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్, ఓయూ ఇన్‌చార్జి బోయ రమేష్ డిమాండ్ కోరారు. ఈ మేరకు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఫార్మడీ ప్రవేశాలను కౌన్సెలింగ్ ద్వారా చేట్టాలని శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చబొల్లారం, అల్వాల్, వెంకటాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులతో అల్వాల్ సర్కిల్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో బీటీ, సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్, బాక్స్ డ్రైనేజీ, స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, సీసీ, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని, టెండర్ అయి మధ్యలో ఆగిపోయిన పనులను పునరుద్ధరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈఈ శ్రీకాంత్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సాంబయ్య, డీఈ కార్తీక్, రంజిత్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అరుణ్, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితాఅనిల్‌కిషోర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, కరంచంద్, రాము యాదవ్, మల్లేష్‌గౌడ్, మహేష్, ప్రశాంత్‌రెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ వివాదంలో ముగ్గురిపై కేసు

మేడిపల్లి: అక్రమంగా ప్లాటు కబ్జాకు యత్నించిన ముగ్గురిపై కేసు నమోదైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్‌కు చెందిన బన్నాల ప్రవీణ్, సోలిపురం ముత్యంరెడ్డి, విక్రమ్‌రెడ్డి అంతా కలిసి పర్వతాపూర్ సాయిప్రియ నగర్ కాలనీ రోడ్డు నెంబర్–1, సర్వే నంబర్–5, 8, 9లో ప్లాట్ నెంబర్–12లో 200చదరపు గజాల ప్లాట్‌ను 2004లో కొనుగోలు చేశారు. ఈ స్థలానికి జీపీఏ హోల్డర్ సత్యనారాయణ, సుకేందర్‌రెడ్డి అనే వ్యక్తులు సదరు ప్లాటును మరొకరికి డబుల్ రిజిస్ట్రేషన్ చేసి విక్రయించారు. అయితే ఆదివారం ఈ ప్లాటును తనదే అంటూ స్థానికంగా ఉంటున్న చిలుముల జగదీశ్వర్‌రెడ్డి, కొందరు వ్యక్తులతో కలిసి ప్లాటు వద్దకు వచ్చి హద్దురాళ్లను తీసేసి జేసీబీ సాయంతో చదును చేస్తుండగా అక్కడికి వెళ్లిన ముత్యంరెడ్డి, ప్రవీణ్‌ను బెదిరించడంతో వారు వెంటనే మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు అనంతరం బెదిరింపులకు పాల్పడ్డ జగదీశ్వర్‌రెడ్డితో పాటు ఒకే ప్లాటును ఇద్దరికి విక్రయించి, రిజిస్ట్రేషన్ చేసి చీటింగ్‌కు పాల్పడిన సత్యనారాయణ, సుకేందర్‌రెడ్డిలపై శుక్రవారం పలు సెక్షన్లతో పాటు 420 కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కష్టపడితేనే.. ఉన్నతస్థానాలకు..

అల్వాల్: నేరేడ్‌మెట్‌లోని భవన్స్ వివేకానంద కళాశాలలో శుక్రవారం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీఎస్‌వీఆర్‌కె.చౌదరి, రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామిజీ బోధమయానంద మహారాజ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిజీ బోధమయానంద మహారాజ్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఆత్మ పరిశీలన చేసుకుంటూ ముందుకెళ్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చన్నారు. గ్రూప్ కెప్టెన్



సెక్రటరీ డి.రమణయ్య, కళాశాల డాక్టర్ సీమా ఘోష్, పూర్వ విద్యార్థి రాహుల్‌సింగ్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి

మల్లాపూర్: జలమండలి అధికారులతో శుక్రవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరమైన చోట నూతన లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓల్డ్ మల్లాపూర్, బ్రహ్మపురి కాలనీ 51 బస్టాప్, ఛండీయానగర్, సూర్యనగర్, బ్యాంక్ కాలనీ, అశోక్‌నగర్, నెహ్రూనగర్, బాబానగర్ ఐస్ ఫ్యాక్టరీ వద్ద నిత్యం డ్రైనేజీ పొంగి పొరుతోందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. డివిజన్ పరిధిలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్లు అవసరమైన చోట ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రక్తదాన దినోత్సవ సందర్భంగా నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం రోగులకు కోసం ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. నాచారం ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.కమల, డాక్టర్ చీమ శ్రీనివాస్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ నేత సాయిజెన్‌శేఖర్, వేముల మారయ్య, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్‌రావు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



శివపార్వతుల కల్యాణం

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వాసవి కన్యకాపరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చివరి రోజు శివపార్వతుల కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ శాశ్వత చైర్మన్ రామక్రిష్ణారావు, సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గుప్తా, కార్యదర్శి వెంకన్న గుప్తా, ట్రస్ట్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే నిమిషాంబదేవి



నిమిషాంబదేవిని దర్శించుకున్న నాగూర్‌బాబు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని నిమిషాంబదేవి ఆలయాన్ని ప్రముఖ నేపథ్య గాయకుడు, నటుడు, నిర్మాత నాగూర్ బాబు, జబర్దస్త్ కామెడీ షో టీం లీడర్ రాకింగ్ రాకేష్ శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగూర్‌బాబు మాట్లాడుతూ నిమిషాంబ దేవి భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందారన్నారు. అమ్మవారిని దర్శించుకుంటే కష్టాలు తొలగిపోయి అన్నీ శుభాలే కలుగుతాయన్నారు. ఆలయ ప్రతినిధులు వినోద్‌కుమార్, గౌరిశంకర్, అశోక్‌కుమార్, శ్రీనివాస్, రమేష్, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి' హామీలను అమలుచేసిన కాంగ్రెస్

బోడుప్పల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్ అన్నారు. బోడుప్పల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల మేరకు వారసత్వ ఉద్యోగాలకు వయో పరిమితి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 35 సంవత్సరాల నుంచి 45 ఏళ్లకు పెంచారని, 2018 మార్చి నుంచి ఇది వర్తిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

లాసెట్‌లో విజయనందినికి 3వ ర్యాంక్



మల్కాజిగిరి: లాసెట్ ఫలితాల్లో మల్కాజిగిరి రామచంద్ర ఎన్‌క్లేవ్‌కు చెందిన ఆర్‌పీ విజయనందిని రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించింది. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ కళాశాలలో విజయనందిని సీఈసీ గ్రూపు తీసుకొని ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. చిన్నతనం నుంచి లాయర్ కావాలన్న లక్ష్యంతోనే సీఈసీ గ్రూపు తీసుకుందని రాష్ట్రస్థాయిలో 84 మార్కులతో మూడవ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందని ఆమె తల్లిదండ్రులు ఆర్‌పి నాయుడు, కృష్ణవేణి తెలిపారు.

నాలా కల్వర్టు పనులు ప్రారంభం

అల్వాల్: వెంకటాపురం డివిజన్ శివనగర్‌లో జరుగుతున్న నాలా కల్వర్టు నిర్మాణ పనులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హయాంలో ఈ పనులకు శంకుస్థాపన కాగా శుక్రవారం పనులు ప్రారంభమయ్యాయని వారు తెలిపారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, కాంగ్రెస్ నాయకులు జనార్దన్, కేబుల్ శేఖర్, నరేష్, బాలరాజు, సాయి, జోసెఫ్, సత్యం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు